# ఎల్లోరా

అతని పొరపాటేం లేదనుకుంటా- అజ్ఞానమో అహంకారమో యేదో మొత్తానికి సరిగ్గా అంచనా వేయలేకపోయాను.

కేదార్ పలకరించేవాడు బోలెడంత పరవశంతో. అంతకు ముందు యెంతమంది పలకరించలేదు? అప్పుడు పనిచేసిన విచక్షణా జ్ఞానం యితని దగ్గరకొచ్చేసరికి యెలా ఫ్రీజ్ అయిపోయిందో?!

అందం?! మంచితనం?! యే బరువూ బాధ్యతలూ డిమాండ్స్ పెట్టని అంతో యింతో తమ అవసరాలకి పనికొచ్చే విమెన్‌తో కాలం సాగించాలనే సోకాల్డ్ అత్యాధునిక యింటలెక్చువల్ ప్రోగ్రెసివ్ కుర్రాళ్ళ గాలానికి చిక్కకుండా పో! పోరా! మీరేంటో మాకు తెలుసులే! అని క్షణంలో వారి చిరునవ్వుల చిందులాటలకు బ్రేక్ వేసేసి యే చిన్ని అతుకుల గతుకుల్లోకి మనసు జారకుండా యిన్నేళ్ళూ లాక్కొచ్చి చివరికి వూబిలో కూరుకుపోయినట్లుంది.

'టీ తాగుతావా ఎల్లోరా?'

రాయడం ఆపి తలెత్తి ప్రసన్న వైపు చూసి 'వూ' అంది.

గది గుమ్మం మధ్యలో నిలబడిన ప్రసన్న క్షణంలో మాయమై ట్రేతో ప్రత్యక్షమయ్యాడు. వో కప్పు అందుకుని సిప్ చేస్తూ 'యేంటి త్వరగా వచ్చావివాళ!' అడిగింది.

'సీత వూరెళ్ళింది నాల్రోజుల వరకూ రాదట!' అన్నాడు.

'నాల్రోజుల కబుర్లన్నీ అయిదోరోజు చెప్పి బాగా లేట్‌గా వస్తావా?' అంది.

'లేదు లేదు. యే రోజువి ఆ రోజే ఫాక్స్ చేద్దామనుకుంటున్నాను'

'వుహూ'

'హారతీమిశ్రా దగ్గర పనేం లేదట! సీత చెప్పమంది'.

'ప్చ్! యేంటో ప్రసన్నా! నాకెప్పుడూ పర్సనల్ లైఫ్‌లోనూ అఫీషియల్ లైఫ్‌లోనూ వొక్కసారే డిస్టర్బెన్సెస్ వస్తాయి. యీసారి ప్రత్యేకత యేమిటంటే రెండూ వొకే చోట వచ్చాయి' ఖాళీ కప్పు ట్రేలో వుంచుతూ అంది.

కిటికీ అద్దాల నుంచి ఆమె ముఖంపై రిఫ్లెక్ట్ అవుతోన్న సాయంత్రపు లో వెలుగుని చూస్తూ 'ఎల్లోరా! అఫీషియల్ లైఫ్ గురించి నువ్వేమీ వర్రీ అవ్వొద్దు. యీ రోజు కాకపోతే రేపైనా వుద్యోగం దొరుకుతుంది. యిక నీ పర్సనల్ డిస్టర్బెన్స్ అంటావా! నువ్వు యెక్కడ డిస్టర్బ్ అయ్యావో తెలుస్తుంది కానీ, యెందుకయ్యానో తెలియదు కదా! గత యేడాదిగా నువు బాధపడుతున్నావ్. మీ పేరెంట్స్‌ని చూడడానిక్కూడా వూర్లోంచి కదలడం లేదు. నువ్వింతలా అన్ని పనులూ మానేసి బాధపడుతున్నావంటే నీ మనసెంత గాయపడిందో

అర్థమవుతూనే వుంది కానీ నాకేం చెయ్యాలో తెలియదు'.

మంచం మీద మంచి జరిగి గోడకు అనుకుని కూర్చుంటూ రాస్తున్న డైరీని చేతిలోకి తీసుకొని పేజీలు అటూ అటూ తిప్పుతూ 'వూ పర్సనల్ డిస్టర్బెన్సా! మనం యెవరివల్ల అయినా బాధపడినా, సంతోషపడినా మరొకరితో షేర్ చేసుకోవడం పెద్ద అపచారమైపోయింది. ముఖ్యంగా పర్సనల్ రిలేషన్‌షిప్స్‌లో బాధపడినప్పుడో యిద్దరు వ్యక్తులు విడిపోయినప్పుడో ముఖ్యంగా ఆడవాళ్ళు యేమీ మాట్లాడకుండా వుంటే యెంత మంచిదో! వొక్క మాటకూడా మాట్లాడలేదు. 'డిగ్నిఫైడ్' అని గొప్పగా చెప్పడం, మాట్లాడితే 'ప్రోగ్రెసివ్' కాదు... యీ ఆడవాళ్ళంతా యింతే... యెదుగుదల లేదు' అని హేళన చేస్తారు. యీ పిచ్చి గోలలన్నీ పడేకంటే మన యేడుపు మనం యేడవడం వుత్తమం కదా!'

'అలా అంటే యెలా? షేర్ చేసుకోవడం ముఖ్యం కదా! జరిగినదాంట్లో యెవరి అండర్‌స్టాండింగ్ యెంతో ఎనలైజ్ చేసుకోవడం యెంతో అవసరం కదా!'

'అండర్ స్టాండింగ్!?' అంటూ నవ్వింది పేలవంగా.

ప్రసన్న వో బోల్స్టర్ లాక్కుని మంచంకి వో వారగా వాలి 'నువ్వూ కేదార్ స్నేహితులు కదా! అతను నిన్ను పెళ్ళి చేసుకోవాలని అనుకున్నాడు. అడిగాడు. నువ్వూ వొప్పుకున్నావ్ మ్యారేజ్ రిజిస్ట్రేషన్ డేట్ కూడా ఫిక్స్ చేసుకున్నారు. నేనూ సీతా వెళ్ళి అతను యెందుకు రాలేదో కనుక్కుంటామంటే నువ్వు వద్దన్నావ్. నాకు తర్వాత్తర్వాత అతని గురించి కొన్ని విషయాలు తెలుస్తూనే వున్నాయి. కానీ ఆ విషయాలేవీ నీతో మాట్లాడటం నాకిష్టం లేదు. రిజిస్ట్రేషన్ ఆఫీసుకి రాకపోవటం అన్నది జరిగి యేడాది అవ్వట్లే! నువ్వింకా అతని విషయంలో యే నిర్ణయం తీసుకోలేదనిపించింది. నా మాటలు నీ నిర్ణయాన్ని యిన్‌ఫ్లుయెన్స్ చేస్తాయేమోనని నేనేం మాట్లాడటం లేదు'.

ఎల్లోరా చిన్నగా నవ్వి 'నీ మాటలు నా నిర్ణయాన్ని మార్చలేవు. యెందుకంటే నిర్ణయం తీసేసుకున్నాను. నాపై అధికారాన్ని ప్రకటించినరోజే నాకు అనుమానమేసింది నేను అతన్ని సరిగ్గా అంచనా వేయలేదేమోనని. ఆ తర్వాత అతను ప్రవర్తిస్తున్న తీరు నా అనుమానాలని నిజం చేసింది. అయినా నేను తొందరపడలేదు. మనుషులు యెప్పుడూ వొకేలా వుండలేరుగా! వెయిట్ చేద్దాం అనుకున్నాను. ప్రసన్నా! నీకు తెలుసా? అతను యెంత బాధ్యతా

రహితంగా ప్రవర్తించాడంటే వో రోజు అడిగాను. నీ ప్రవర్తనలో తేడా కనిపిస్తున్నది యేంటి నువ్వు రిజిస్ట్రేషన్ ఆఫీసుకి వస్తావా? రావా? కేన్సిల్ చేసేద్దామా? అని వొద్దొద్దు! వస్తానన్నాడు. రాలేదు. కనీసం రానని చెప్పలేదు. తర్వాతైనా అలా యెందుకు చేశాడో యేం మాట్లాడలేదు. ఆ రోజే నిర్ణయించేసుకున్నా కాని ఆ బాధ నుంచి అవమానం నుంచి బయటికి రావటానికి యింత కాలం పట్టింది' అంది.

'నిర్ణయించేసుకున్నావా? నీకు కేదార్ అంటే బోలెడంత యిష్టం కదా! యింకొకసారి ఆలోచించు'.

' ఆలోచనా? యింకా నయం! కేదర్ సరిగ్గా ఆలోచించుకోలేకపోతున్నాడని గత యేడాదిగా మా యిద్దరి స్నేహం నిలబడాలని. విడిపోకూడదని నేనెంత ఎఫర్ట్ పెట్టానో నీకు తెలుసు. దాదాపు సంవత్సరంగా నేను మిగిలిన ప్రపంచాన్ని మరచిపోయాను. నా అఫీషియల్ జీవితాన్ని పట్టించుకోలేదు కానీ కేదార్ నన్నెంతగానో అవమానించాడు అతని చుట్టూ వున్న వాళ్ళు కేదార్ వెంటపడుతున్నానని యెంతలా మాట్లాడుకోలేదు? అన్నీ భరించాను. యెందుకు? వొకప్పుడు మా యిద్దరి మధ్యా వున్న స్నేహం కోసం ప్రేమకోసం. కాని యింక నావల్ల కాదు. అతను తన నిర్ణయం గురించి యేమీ ఆలోచించుకోలేదు. నామీద చాలా చికాకు పడ్డాడు నేనేం చేయలేనింక యీ దుఃఖం యెలా పోతుందో కూడా నాకు తెలియదు. నా బాధ దుఃఖం అతనికి సంబంధం లేదు. పొరపాటో గ్రహపాటో జరిగిందేదో జరిగింది. నా అఫీషియల్ లైఫ్ మీద యెఫర్ట్ పెట్టాలనుకుంటున్నాను. నా యెబిలిటీస్ పెంచుకోవాలి. తిరిగి నా ప్రపంచాన్ని నిర్మించుకోవాలి. యింక కేదార్ అంటావా... ముందు తన గురించి వో రూపం సారం యిచ్చి పరిచయం చేసుకున్నాడు. ఆ కేదార్ అంటే నాకిష్టం. ఆ కేదార్ పెళ్ళి చేసుకుందామా? అంటే ఒప్పుకున్నాను కూడా. అంతే కానీ సందర్భం వచ్చినప్పుడు కేదార్ యేంటో, అతని అసలు రూపమేంటో తెలిసింది. ఆ కేదార్ నాకొద్దు' ఆమె కళ్ళలో నీళ్లు. 'యేడాదిగా తోడుగా వున్నవి నాకన్నీళ్ళే యింకా నీళ్ళు వస్తూనే వున్నాయి' అందామె.

'వో...సారీ! నిన్ను డిస్టర్బ్ చేసినట్టున్నాను ప్లీజ్ రిలాక్స్'.

యేంచేయాలో తెలియనట్టు ప్రసన్న దిగులుగా ఆమె వైపు చూస్తూ కూర్చున్నాడు.

కాసేపటికి ఎల్లోరా తనను తాను కంట్రోల్ చేసుకుంటూ 'యిట్స్ వోకే!

కాసేపు పడుకుంటాను' అంది.

ప్రసన్న లైట్ తీసేసి గదిలోంచి వెళ్ళిపోయాడు.

* * *

న్యూస్ వీక్లీలో జాయిన్ అయిన కొత్తలో కేదార్ వచ్చి పరిచయం చేసుకున్నాడు.

న్యూస్ వీక్లీ అధిపతి భానుమతికి ఎలక్ట్రానిక్ మీడియాతో యిబ్బడి ముబ్బడిగా పరిచయాలు. చిన్నాచితకా వ్యాపారాలతో ఆమె యెప్పుడూ బిజీగానే కనిపిస్తారు.

పేపర్‌కి సంబంధించిన మొత్తం విషయాలు కేదార్ చూసుకునేవాడు. వో రోజు ఎల్లోరా వో కంట్రాక్టర్‌కు సంబంధించిన అవినీతి విషయం రిపోర్ట్ చేసింది.

ఆ ఐటెమ్‌ని న్యూస్ యెడిటర్ తొక్కిపెట్టాడు.

'ఆ ఐటెమ్ రాలేదేంటి?' అడిగింది ఎల్లోరా.

'మాకు తెలుసు యేం వెయ్యాలో! యేం వెయ్యకూడదో!'

'వెయ్యకూడనిది యేముందందులో?'

న్యూస్ యెడిటర్ మాట్లాడలేదు.

'మీ అభ్యంతరమేమిటి?'

'యెందుకు ప్రతి చిన్న విషయం పట్టించుకుంటారు?' అసహనంగా అన్నాడు న్యూస్ యెడిటర్.

'అది చిన్న విషయమా? అందులో డబ్బులు మాత్రమే కాదు మనుష్యుల ప్రాణాలున్నాయి. యింతకుముందు యిదే కంట్రాక్టర్ కట్టిన బిల్డింగ్ కూలి యెంతమంది చిన్నపిల్లలు చనిపోయారో గుర్తులేదా? వొకటా రెండా? అన్ని కన్‌స్ట్రక్షన్స్ అతనికి యిస్తూంటే అది చిన్న విషయమా? ఆ బిల్డింగ్ సర్విపై చేస్తున్న వాళ్ళూ అంతే నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారు. అయినా పోయినసారి బిల్డింగ్ కూలిపోయినప్పుడు యిలాంటి అవినీతిపరులకు కంట్రాక్ట్ యివ్వం అని, వున్నవి రద్దు చేస్తామని మినిస్టర్ చెప్పి తిరిగి యెలా అతనికి యింత పెద్ద వర్క్ యిచ్చారు?'

'యిందులో మీకేంటి అంత యింటరెస్ట్?' అడిగాడు న్యూస్ యెడిటర్.

'అంటే?'

'యిది ఖచ్చితంగా రావాలని మీరెందుకు అంతలా పట్టుబడుతున్నారు?'

'అది రావాల్సిన న్యూస్ కాదా?'

'యేమో వెయ్యట్లేదు!'

'మీరు ఆ న్యూస్ యెందుకు వేయరో చెప్పలేరా?'

'మీకేంటి చెప్పేది? వెయ్యను. యేం చేసుకుంటారో చేసుకోండి' చికాగ్గా అన్నాడు న్యూస్ ఎడిటర్.

ఆరోజే ఎల్లోరా యీ విషయాన్ని భానుమతికి యిన్ఫార్మ్ చేసింది.

అంతా విని 'నేను మాట్లాడతాలే!' అన్నారామె.

వారం రోజులు గడిచిపోయినా భానుమతి యేమి మాట్లాడారో? న్యూస్ ఎడిటర్ యేమన్నాడో యే విషయమూ ఎల్లోరాకి చెప్పనే లేదు. ఎల్లోరానే వో రోజు భానుమతి దగ్గరికెళ్ళి విషయమేమైందని అడిగింది.

'ఆ విషయం మర్చిపో ఎల్లోరా!' మృదువుగా అంది భానుమతి.

'యెందుకు?'

తన కళ్ళద్దాల పైనుంచి చూస్తూ 'నే చెప్తున్నాను'

'యెందుకని?'

'యింక వెళ్ళి నీ పని చూసుకోవచ్చు' అని కళ్ళని కంప్యూటర్ మానిటర్‌కి ఆన్చేసింది.

* * *

కాన్ఫరెన్స్ హాల్‌లో మీటింగ్ జరుగుతోంది. అందరూ యేవేవో మాట్లాడుతూనే వున్నారు. భానుమతి, కేదార్ మార్దవంగా నవ్వుతూ మురిపెంగా అందరి సమస్యల్ని తీర్చేస్తూ వాళ్ళకి సజెషన్స్ యిచ్చేస్తూ మీటింగ్‌ని సమర్థంగా నడిపించేస్తున్నారు.

'ఎల్లోరా! గత పది రోజులుగా మీరేం రిపోర్ట్ చేయడం లేదట? యెందుకని' అడిగింది భానుమతి.

'యిస్తూనే వున్నాగా'

'యేం యిస్తున్నావు? మరీ యింత చిన్న చిన్న న్యూస్ ఐటెమ్స్

'పట్టుకొస్తున్నావేంటి? కష్టపడి పనిచేయాలి కదా' అందామె.

'యెవరి కోసం?'

'అంటే?'

'మీక్కావలసింది అలాంటి ఐటెమ్స్ కదా! యే మంత్రి యే శంకుస్థాపన చేశారో? యే ఆఫీసర్ యే బస్తీలో తిరిగారో? అవి తీసుకొస్తే సరిపోతుందిగా అంతకంటే పెద్ద ఐటెమ్స్ తీసుకురావటం యెందుకు?'

'బస్తీలో యేం జరిగిందో శంకుస్థాపనలు యివే ఐటెమ్స్ తీసుకురావడానికి మీరే యెందుకు? యే టెన్త్‌క్లాసు చదివిన వాళ్ళయినా ఆ పని చేయగలరు కదా? సరిగ్గా పని చేయండి' అన్నారు భానుమతి.

'గత మూడు నెలలుగా యెంతో కష్టపడి కొన్ని ఐటెమ్స్ యిచ్చాను. వాటన్నింటినీ మీరేం చేశారు? మీక్కావలసింది విషయాలు ముట్టీ ముట్టకుండా వుండడం. అంతమాత్రానికే కష్టపడి పని చేయాలి! సిన్సియర్‌గా పని వుండాలి! అని చెప్పటం యెందుకు?' శాంతంగా అడిగింది ఎల్లోరా.

'హోల్డ్ యువర్ టంగ్' కోపంగా అన్నాడు కేదార్.

ఎల్లోరా స్థాణువై అతనివైపు చూస్తుండి పోయింది. తన చెవులు సరిగ్గా పని చేస్తున్నాయా? అని తనపై తనకి అనుమానం వేసింది. కాస్త గట్టిగా మాట్లాడినా చిన్నమాట అన్నా ఎల్లోరా నొచ్చుకుంటుంది- తనతో సరిగ్గా బిహేవ్ చేయండని తన చుట్టూ వున్న అందరికీ చెప్పే కేదారేనా తనని అంత మాట అంది! తనతో పొల్లు పోకుండా, తన మానసిక స్థితిని గౌరవిస్తూ, అభిమానంగా మాట్లాడే కేదారేనా 'యిలా మాట్లాడుతున్నాడు? యెలా సాధ్యం? యెలా వచ్చిందింత అసహనం? అసలు యెవరైతేనే అలా మాట్లాడుతున్నారంటే దాని అర్థమేంటి?

'వాటార్యూ టాకింగ్ ఎల్లోరా? యూ...

'వోకే.. వోకే... అసలు విషయానికొద్దాం' అంటూ భానుమతి కేదార్ మాటలకు అడ్డొచ్చారు.

మీటింగ్ అయిపోయాక బయటికొస్తుంటే 'యెందుకమ్మా వాళ్ళతో నీకు? నువ్వింకా చిన్నపిల్లవి. యిక్కడ వార్తలు రావు యిక్కడే కాదు! యెక్కడైనా అంతే. అందరికీ అందరితో పన్లుంటాయి. మొహమాటాలుంటాయి. అవసరాలుంటాయి. డబ్బులు కనిపిస్తుంటాయి. మనం కష్టపడి వార్తలు తీసుకువస్తాం! వాటిని యెవరి స్థాయిలో వాళ్ళు వాడుకుంటారు. కావాలంటే

మనం మన లెవెల్‌లో వాడుకోవచ్చు. డబ్బుకో మరొకదానికో నావరకు నేను దిగజారలేక వార్తల్నిచ్చేసి వూరుకుంటున్నాను. అవి యేమవుతున్నాయో పట్టించుకోవడం మానేశాను. మొదట్లో పట్టించుకుని వుద్యోగాలు పోగొట్టుకున్నాను. యీ విషయాలు అర్థమయ్యాక బతకడానికి యేదో వొక వుద్యోగం తప్పదు కదా! అని యేమీ మాట్లాడకుండా వార్తలిచ్చేసి వుద్యోగానికి ఎడ్జెస్ట్ అయిపోయాను. వీళ్ళని నువ్వు తట్టుకోలేవమ్మా!' అనునయంగా అన్నారు నరసయ్యగారు.

ఎల్లోరా నిశ్శబ్దంగా చూస్తుండిపోయింది.

* * *

సాయంత్రం యేడు గంటలు. ఎల్లోరా ప్రసన్న కాయగూరలు కొనడానికి దగ్గర్లోని మార్కెట్‌కి నడిచి వెడుతున్నారు. ట్రాఫిక్ హడావిడి లేని ఆ కాలనీ రోడ్డుకి అటూయిటూ బోల్డన్ని పారిజాతాలు.

పారిజాతాల గాలి పలకరిస్తుంటే 'యీ పూలంటే సీతకి భలే యిష్టం' అన్నాడు ప్రసన్న.

'సీత నాలుగు రోజుల్లో వచ్చేస్తుందన్నావుగా యింకా రాలేదేంటి?' అడిగింది ఎల్లోరా.

'పని కాలేదంట. యింకో రెండు రోజులు పడుతుందేమో'.

'తనొస్తే మాథుర్ దగ్గరికి వెళ్ళాలి. వుద్యోగం యేమైందో కనుక్కోవాలి'

'నిన్ను వాళ్ళు వుద్యోగం మానేయమన్నారా?'

'లేదు. వాళ్ళు యెవర్నీ వుద్యోగం మానెయ్యమనరు. మానేసేటట్టు చేస్తారు'

'యెలా?'

'వెరీ సింపుల్ మన వునికిని గుర్తించరు. చాలా అనుమానంగా చూస్తారు. అవమానిస్తారు. పైవాళ్ళకి భయపడి మన కొలీగ్స్ యెవరూ కూడా ఆఫీసులో మాట్లాడరు. భయం భయంగా తప్పుకుని తిరుగుతూ వుంటారు. వుద్యోగం పోతుందేమోనని భయం. అంత యిరుకుని తట్టుకోవడం నావల్ల కాలేదు. వచ్చేశాను'.

'కేదార్‌తో మాట్లాడలేదా?'

'అసలు విషాదం అదేగా. మాట్లాడాను. భానుమతిని అర్థం చేసుకోవచ్చు. ఆమెకి బిజినెస్ ముఖ్యం. ఆవిడ విలువలతో మనకి కుదరకపోతే మనం వచ్చేయవచ్చు. ఆవిడకి నచ్చకపోతే ఆవిడా మనల్ని వద్దనుకోవచ్చు. అది అఫీషియల్ బంధం. కానీ నాకు కేదార్‌కి మధ్య వున్నది అఫీషియల్ రిలేషన్‌షిప్ మాత్రమే కాదు కదా! వో లాంగ్‌టర్మ్ పర్సనల్ ప్లానింగ్ వుంది. భానుమతికి నాకు మధ్య డిఫరెన్స్ రాగానే కేదార్ నన్ను అవాయిడ్ చేయడం మొదలుపెట్టాడు. మాట్లాడడానికి వెళితే లేచి వెళ్ళిపోతాడు. ఫోన్ చేస్తే లేనని చెప్పేవాడు. యిదంతా ఆ మీటింగ్ రోజు నుంచే మొదలయింది. అతని నిర్లక్ష్యాన్ని యెలా అర్థం చేసుకోవాలో తెలియక కంగారు పడ్డాను. అయినా కూడా అతన్ని యెందుకిలా ప్రవర్తిస్తున్నావని అడిగాను. 'నా యిష్టం' అని వ్యంగ్యంగా సమాధానం చెప్పాడు. అతను నాతో యే సంబంధమూ వద్దనుకుంటున్నట్టున్నాడు' అంది యెల్లోరా.

'మరొకసారి మాట్లాడరాదా అతనితో'

'యేం మాట్లాడాలి ప్రసన్నా! మామూలు పరిచయస్తులు స్నేహితులు కూడా నాతో యెప్పుడూ యెవ్వరూ అలా ప్రవర్తించలేదు. అతను వొద్దనుకుంటే ఆ విషయాన్ని డైరెక్ట్‌గా చెప్పవచ్చు. అంతే కాని యిటుపక్క వాళ్ళను అవమానించనక్కరలేదు దగ్గరివాళ్ళనుకున్న వాళ్ళు వొకళ్ళనొకళ్ళు అవమానపర్చుకుంటే ఆ స్నేహానికి అర్థమే లేదు'

'యేం కాయకూరలు కొందాం'.

* * *

ఎల్లోరా సీత వో పెద్ద సూట్‌కేసును సర్దుతున్నారు. ప్రసన్న కొన్ని పుస్తకాలు, క్యాసెట్లు జాగ్రత్తగా ప్యాక్ చేస్తున్నాడు.

'ఎల్లోరా! వొక్కసారి కేదార్‌తో మాట్లాడకూడదా?' అడిగింది సీత.

'యేం మాట్లాడను సీతా?'

'యేమీ అక్కరలేదు. ఎల్లోరా నిర్ణయం సరైందే అనుకుంటున్నాను. కేదార్‌కి ఎల్లోరా వొకప్పుడు కావాలి. కానీ ఆమె తన కెరీర్‌కి అడ్డు అనుకోగానే ఆమెను వొద్దనుకున్నాడు. అతని స్టాండ్ భానుమతి వైపు. తన కెరీర్‌కి భానుమతి అండదండలు చాలా అవసరం. ప్రేమదేముంది? ఎల్లోరా కాకపోతే హంపీయో, అమరావతో, అజంతానో యెవరో వొకరు తనకున్న పరపతికి యే అమ్మాయి

ప్రేమనయినా అతను కావాలనుకుంటే సునాయాసంగా సంపాదించుకోగల వనుకుంటున్నాడు. సంపాదించు కోవచ్చేమో! నిజానికి అతను ఎల్లోరాతో స్నేహంగా వున్నంత మాత్రాన భానుమతి అతనినేమీ ఉద్యోగంలోంచి తీసెయ్యదు. అతని పైకి రావడానికి అడ్డుపడదు. అతనికివ్వాల్సిన సపోర్టు ఆవిడ యివ్వగలదు. ఆమె అఫీషియల్ విషయాలలో చాలా యెదిగిన వ్యక్తి. కేదార్‌కి 'మీతో గట్టిగా మాట్లాడేవాళ్ళు నాకెంత దగ్గర వ్యక్తులయినా సరే మీకోసం నేను వొదులుకుంటాను. నాకు మీరే ముఖ్యం' అని ఆమెను మరింత యింప్రెస్ చేయడానికి ఎల్లోరాని బాధపెట్టాడు. నిజంగా ఎల్లోరా యిదంతా యెలా తట్టుకుందో!'

'నీకెలా తెలుసు?' అడిగింది సీత

'కేదార్‌తో మాట్లాడాను. అనవసరమనిపించింది. వోకే... త్వరగా కానీయండి. టైమవుతోంది'

చివరి నిమిషం వరకూ సర్దుతూనే వున్నారిద్దరూ.

యెయిర్‌పోర్ట్‌కి ఫోన్ చేసి ఫ్లైట్ యిన్‌టైమో కాదో కనుక్కుంటాను' అని హాల్లోకి వెళ్ళాడు ప్రసన్న.

* * *

'హాయ్ ప్రసన్నా! నిన్ను యిక్కడి వరకూ రమ్మనకుండా నేనే నీదగ్గరికి రావాలనుకున్నాను. కానీ యినాగరల్ సెషన్ అయిపోగానే వెళ్ళాల్సివస్తోంది. యిక్కడ నీ పనులెలా వున్నాయి?' చిరునవ్వుతో అడుగుతున్న ఎల్లోరాని ఆశ్చర్యంగా చూస్తున్నాడు ప్రసన్న.

ఎల్లోరా పరిచయమైన తొలిరోజుల్లో కళ్ళల్లో నవ్వులో బోల్డంత మెరుపు. ఆ ఎల్లోరాని తిరిగి చూస్తుంటే బోలెడంత సంతోషం వేసింది.

ఎల్లోరా రూమ్ సర్వీస్‌కి కాల్‌చేసి కాఫీ పంపించమంది.

'ఎల్లోరా! నీ అఫీషియల్ లైఫ్‌లో యెచీవ్‌మెంట్స్ సక్సెస్ తెలుస్తూనే వుంది నీ పర్సనల్ లైఫ్ కూడా వోకే కదా' అడిగాడు ప్రసన్న.

చిన్నగా నవ్వింది.

ప్రసన్న తనేం పనులు చేస్తున్నాడో సీత ట్రైనింగ్ కోసం జెనీవా వెళ్ళిందని, పిల్లల చదువులు చెప్తూ, చెప్తూ మధ్యమధ్యలో ఎల్లోరా అడుగుతున్న కామన్ ఫ్రెండ్స్

విషయాన్ని చెప్తున్నాడు.

ప్రసన్నే కాసేపు తటపటాయించి 'కేదార్ గురించి అడగవేం?' అన్నాడు.

'యేమడగాలి? అతని జీవితం అతనిది'.

'నో. అసలు యిప్పుడు యింత దూరం నేనొచ్చింది నిన్ను చూడాలని మాత్రమే కాదు. నువ్వెళ్ళిపోయాక అప్పుడప్పుడు నేనూ కేదార్ కలుస్తూనే వున్నాం. గత సంవత్సర కాలంగా కేదార్ నీ గురించి బాధపడుతున్నాడు. జరిగిందేదో జరిగిపోయింది. అతను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడు. అఫ్‌కోర్స్! నువ్వెళ్ళిపోయాక రెండో మూడో ఎఫెయిర్లు నడిచాయి. కొన్ని బ్రేక్ అయ్యాయి. అయినా కూడా వాళ్ళెవర్నీ అతను పెళ్ళి చేసుకోవాలని అనుకోలేదట. నీకు దూరంగా వుండాలని కేదార్ అనుకున్న రోజుల్లో అతనికి తన అఫీషియల్ లైఫ్ చాలా ముఖ్యం అనుకున్నాడు. నీతో స్నేహంగా వుంటే భానుమతితో గొడవ వస్తుందనుకున్నాడు. నువ్వంటే యిష్టం లేక కాదట! అప్పటికి అతనికి తన కెరీరే ముఖ్యం అనిపించింది. నీవర్క్ విషయంలో కంట్రోల్ చేయలేని స్థితికి చేరుకున్నాడు. మీ యిద్దరి మధ్యా జరిగిందానికి దిగులుపడుతున్నాడు. వై డోంట్ యూ కన్సిడర్ హిమ్?'

'దిగులా?' తమాషాగా నవ్వి -

'ప్రసన్నా! కేదార్ యేమయినా నాకేమీ సంబంధం లేదు. అతను ప్రొఫెషనల్ లైఫ్‌లో పైకి రావొచ్చు రాకపోవచ్చు. అతని పర్సనల్ అఫీషియల్ లైఫ్ హాయిగా వుండొచ్చు వుండకపోవచ్చు అతను యేమైనా కావొచ్చు. యేదో వొక సమయంలో నేను గుర్తొస్తానని అతను నన్ను మిస్సయ్యానని అనుకుంటాడని అతనిపై నాకున్న యిష్టాన్ని ప్రేమని అర్థంచేసుకుంటాడని అతను నన్ను బాధించానని పశ్చాత్తాపడ్తాడని యిలాంటి భ్రమలేం నాకు లేవు. సహజ మనస్తత్వాలు మారవు. మనుషుల అసలు అంతరంగాలు బయటపడే సందర్భాలు కొన్నిసార్లే యెదురవుతాయి. అప్పుడు కలిగిన బాధ, దుఃఖం నుంచి బయటపడడానికి పెద్ద యుద్ధం చేయాలి. ఆ యుద్ధంలో మనకి మనం మిగలాలి. చలిజ్వరం లాంటి ఆ రోజులు తిరిగి జీవితంలోకి మరోసారి రాకూడదనుకున్నాను. భరించలేకపోయాను. నువ్వూ సీతా బోల్డంత యెమోషనల్ సపోర్ట్ యివ్వడానికి ప్రయత్నించారు. నేనెంత తీసుకోగలిగానో అంతా తీసుకున్నాను. విజువల్ మీడియాలో నా స్థానం నేను సంపాదించుకోవడానికి బోలెడంత ఎఫర్ట్ పెట్టాను. యిన్నాళ్ళూ నేనేం సుఖంగా

లేను. ప్రేమంటే యేమిటో ప్రేమగా వుండాలనుకుంటే యెంత మోహనంగా తన్మయంగా కేదార్ వుండగలడో నాకు తెలుసు. అవన్నీ నాకిచ్చాడు. వొక చిన్న విషయం రాగానే తోసిపారేశాడు. పనిలో యెంత యిన్‌వాల్వ్ అయినా ఆ రోజుల్నుంచి బయటికి రావడానికి యెంత కష్టపడ్డానో? నా అవ్యక్త దుఃఖం నన్నేరోజూ శాంతిగా నిద్రపోనివ్వలేదు. నేను మత్తుగా యెప్పుడు నిద్రపోయానో తెలుసా? చలిజ్వరం లాంటి ఆ రోజుల్ని సినిమాగా పూర్తిచేసి ఫైనల్ కాపీ తెరమీద చూసుకున్న రోజు' నిర్లిప్తంగా చెప్పింది.

'వొక అబ్బాయితో పెళ్ళో కలిసి వుండటమో స్నేహమో యేదైనా కానీ. నాకెందుకు? వో యిమోషనల్ సపోర్ట్ కోసం. ఆ విషయంలో నేను భయంకరంగా కేదార్ వల్ల బాధపడ్డాను. తిరిగి అతనితో జీవితం సాధ్యం కాదు. కనిపిస్తే మాట్లాడొచ్చు పలకరించొచ్చు. కానీ యిప్పుడతన్ని వో అంతరంగిక మిత్రుడిగా ఆహ్వానించలేను. అతను మంచివాడో చెడ్డవాడో గొప్పవాడో ఆ సర్టిఫికెట్లేమీ నేనివ్వబోవడం లేదు. నేనెటువంటి జడ్జిమెంట్లూ యివ్వను. నాకిష్టం వుండదు. అందుకే యెంతమంది నా సినిమాను ఉత్తమ చిత్రాల పోటీకి పంపించమన్నా పంపించలేదు. అతనితో యెవ్వరికీ జీవితం సాధ్యం కాదనే భ్రమేం నాకు లేదు. నాకు సరిపడదంతే!' కాన్ఫిడెంట్‌గా అంటూ - 'సీతను చూడ్డం కుదర్లేదు. యిదిగో యీ ప్యాకెట్ సీతకివ్వు' అందామె.

రిసెప్షన్‌కి ఫోన్ చేసి 'బిల్ రెడీ చేయండి. బ్యాగేజ్ తీసుకెళ్ళడానికి యెవరినైనా పంపించండి' అంటూ రిసీవర్ పెట్టి 'ఎయిర్‌పోర్ట్‌కి వస్తావా?' అడిగింది.

'వూ' అన్నాడు ప్రసన్న.

'నిన్నేమైనా డిస్టర్బ్ చేశానా' నొచ్చుకుంటూ అడిగాడు.

'మనల్ని యెవరైనా డిస్టర్బ్ చేయగలిగే అవకాశం యెవరికైనా మనం యెందుకివ్వాలి?' అంటూ సర్దుకోవల్సినవి సర్దడం మొదలుపెట్టింది.

♦